భార్యమాటలే చెవుల్లో గింగురు మంటున్నాయి...ఛీ ..ఏమిటిది! ఎన్నడూ. లేనిది...తనకు ఇటువంటి ఆలోచనలు వస్తున్నాయి !

"ఈ వూళ్ళో నా తడాకా తెలీనోడు లేడు...తలొంచని యీరుడని మనకి పేరు.."

అవును...తలవంచని వీరుడు తను. భయపడి వెనక్కి తగ్గడం తన రక్తంలో లేదు. వందమంది కాదు...వెయ్యిమంది వున్నా దూసుకు పోగలడు తను...

మందభాగ్యుని మీదికి ముంచుకు వస్తున్న మృత్యువులా ఆకాశంలో చీకటి అలముకుంటున్నది ... అప్పుడప్పుడే వీధిలో లైట్లు వెలుగుతున్నాయి.

గమ్యం దగ్గరపడుతున్న కొద్దీ ఆవేశంతో అతడి హృదయం ఉప్పొంగు తున్నది. కర్తవ్యదీక్ష అతివేగంగా అతడిని గమ్యానికి ఈడ్చుకు వెడు తున్నది...

రావలసిన చోటికి రానేవచ్చాడు... గుంపులు గుంపులు జనం...ఇసుకవేస్తే రాలని జనం...తోపిడి...త్రొక్కిసలాట ...హాహాకారాలు...చొక్కాలు చిరుగు తున్నాయి...మక్కెలు విరుగుతున్నాయి ...పోలీసుల లాఠీఛార్జి . . . కొందరికి రక్తపుగాయాలు...

"శత్రువులను తరిమికొట్టండి. దేశ ద్రోహులను తుదముట్టించండి. విద్రో హులముఠాను సర్వనాశనం చేసిన సాహస గూఢచారికథ...అంతర్జాతీయ గూఢచారి ముఠాను హడలెత్తించిన అపూర్వ గూఢచారి కథ...నేడే చూడండి...

—జేమ్స్‌బాండ్ 7 7 7."

రెండు చేతుల్లో రెండు పిస్తోళ్ళు పట్టుకుని, ఎడంకాలితో ఒకణ్ణి, కుడికా లితో ఒకణ్ణి తన్నుతున్న కథానాయకుని 20 అడుగుల ఎత్తుబొమ్మ కనిపించగానే అతడికి పూనకం వచ్చింది. 'హుం' అని హుంకరించి, కరికి లంఘించు కొదమ సింగమువలె 40 పైసల బుకింగ్‌వద్ద మూగిన వందలాది జనం మీదికి విరుచుకుపడ్డాడు. మోచేతులతో అడ్డువచ్చిన వాడినల్లా పొడిచేశాడు. చొక్కా చిరిగిపోయింది. దానితో పూనకం మరీ ఎక్కువయింది. ముందున్నవాళ్ళని జుట్టుపట్టుకుని వెనక్కి లాగాడు. పక్కనున్న వాళ్ళ డొక్కల్లో తన్నాడు.

"ఏయ్... నీకే చెప్పేది ... ఏంటా దౌర్జన్యం...ఇవతలికి వచ్చావా లేదా" అంటూ పోలీసు లాఠీతో కొట్టాడు. నుదురు చిట్లి బొటబొట రక్తం కారింది. అయినా అతడు లక్ష్యపెట్టలేదు. నెత్తురు తుడుచుకోనైనా లేదు. పద్మవ్యూహంలో అభిమన్యుడిలా ద్విగుణీకృతావేశంతో గుంపును చీల్చుకుని వెళ్ళి బుకింగ్ గూట్లో చెయ్యిపెట్టాడు.

"ఈ వూళ్ళో మన తడాకా తెలీ నోడు లేడు. తలొంచని ఈరుడని మనకి పేరు" అని మీసం దువ్వుతూ, టిక్కెట్ తీసుకుని హాల్లోకి ప్రవేశించాడు.

---

# వల

ఆఫీసునుంచి బయటపడి, యింటిదారి పట్టాను. ఎండలు మండిపోతున్నాయి. గోల్‌మార్కెట్ దగ్గరకు వచ్చేసరికి _గొంతుక తడి ఆరిపోయింది. క్వాలిటీ కౌంటర్‌లో, 'ఫాంటా' ఆరంజి తాగి, రూపాయి నోటిచ్చాను.

"చిల్లర లేదుసాబ్ ! పావలా తర్వాత తీసుకోండి!" అన్నాడు, షాపతను నవ్వుతూ.

మూడోరోజు సాయంత్రం _నేనూ, భల్లా_గోల్‌మార్కెట్ సెంటర్లో మాట్లాడుకొంటున్నాం. "దాహమేస్తోంది రావ్. పద, డ్రింకులు తాగుదాం," అన్నాడు భల్లా. క్వాలిటీ కౌంటర్లో, రెండు 'కోకాకోలా'లు తీసుకొన్నాం. భల్లా డబ్బులివ్వబోతూంటే, "నువ్వాగు. యితను నాకు డబ్బులివ్వాలి." అంటూ_రెండు రూపాయి కాయితాలు తీసి షాపతనికి యిచ్చాను. "మొన్న నాకు పావలా యివ్వాలి నువ్వు. రూపాయిపావలా తీసుకొని, ముప్పావలా తిరిగి యివ్వు," అన్నాను సీరియస్‌గా. నా చేతిలో ఒకరూపాయి నోటు తిరిగిపెడ్తూ, "చిల్లరలేదు సాబ్! పావలా మీరే తర్వాత యివ్వండి," అన్నాడు నవ్వుతూ.

ఓ మూడు రోజులు గడిచిపోయాయి. అతని కివ్వవలసిన పావలా సంగతి మర్చిపోయాను. నాలుగో రోజు నేనూ, మా రెండోవాడూ, మార్కెట్‌కి వెళ్ళాం. వాడు టాఫీలకోసం మారాం చేశాడు. క్వాలిటీ కౌంటర్ పక్కనున్న పాన్‌షాపులో పావలా టాఫీలు తీసుకుని, రూపాయి నోటిచ్చాను. "చిల్లర యివ్వండి సార్," అన్నాడు కొట్టతను_రూపాయినోటును నావైపు నెట్టుతూ. అప్పటికే మా కుర్రవెధవ, రెండు టాఫీలు మింగేశాడు. క్వాలిటీ అతని కివ్వాల్సిన పావలా సంగతి జ్ఞాపకాని కొచ్చింది. అతనికి రూపాయి నోటిస్తూ, "మొన్న నీకు పావలా యివ్వాలి తీసుకొని మిగిలిన డబ్బులివ్వు," అన్నాను.

"దాహమేస్తోంది, నాన్నా: నాకు 'రిమ్‌జిమ్' కావాలి," అన్నాడు మా కుర్ర వెధవ. వాడిది వాళ్ళమ్మలాగే, మంకుపట్టు. అక్కడ రాద్ధాంతం జరగడం నా కిష్టంలేదు. 'సరే' అన్నట్టుగా చూశాను. మరుక్షణంలో మావాడి చేతికి పైనాపిల్ సీసా వచ్చింది.

"పక్క కొట్టతనికి పావలా యివ్వాలికదా అని. నీ దగ్గరకొచ్చాను. ఇప్పుడు రూపాయి సరిపోయింది! ఎలా?" అన్నాను.

"దానికేముంది సార్! పావలా నేనిస్తాను. మీదగ్గర చిల్లరున్నప్పు డిద్దురుగాని!" అంటూ_ కాష్‌బాక్స్ తీసి, పావలా కాసిచ్చాడు. వెంటనే నేను జేబులోంచి మరో రూపాయినోటు తీసి అతనికిస్తూ, "నాకో 'లిమ్కా' కావాలి," అన్నాను. అతనిచ్చిన లెమన్ తాగి, పక్క కొట్టతనికి పావలా యిచ్చేసి, మా కుర్రాడి జబ్బపట్టుకుని యింటిదారి పట్టాను_ క్వాలిటీ షాపతని వలనుండి తప్పించుకొన్నానన్న సంతృప్తితో.

---

ఎలక్ట్రాన్

---